క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతులు

పత్తికొండ(తుగ్గలి) : శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా పట్టణంలోని తేరుబజారులోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుంచే ఆలయంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు జరిపారు. భక్తులతో పాటు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ మూర్తిని తేరుపై అధిష్టింపజేసి మేళ తాళాలతో పట్టణంలో ఊరేగించారు. నాయీబ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి నరసింహులు, గౌరవ అధ్యక్షుడు గోవిందరాజులు, సభ్యులు రామాంజనేయులు, నాగరాజు, లింగన్న పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

పత్తికొండ(తుగ్గలి) : గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఆదోని రోడ్డు నాయీబ్రాహ్మణ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి తాళాలను ధ్వంసం చేసి హుండీని ఎత్తుకెళ్లి పగులగొట్టి 18 తులాల వెండి స్వామివారి నగలు, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు కాలనీ వాసులు తెలిపారు. అలాగే..తుగ్గలి మండలం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో పీర్ల మసీదు, బంకు, రెండిళ్లల్లో దొంగలు చోరీకి ప్రయత్నించారు.

పాఠశాలకు ఎలక్ట్రిక్ బెల్

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన 2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఎలక్ట్రిక్ బెల్ అందించారు. పూర్వ విద్యార్థులు తులసీధర్‌రెడ్డి, లక్ష్మన్న, దాదాఖలందర్, నాగరాజు, ఇస్మాయిల్, లక్ష్మినారాయణ తదితరులు శనివారం ఎంఈఓ-2 రమేష్, పాఠశాల హెచ్‌ఎం మాలతికి ఎలక్ట్రిక్ బెల్‌ను అందజేశారు. వారిని ఎంఈవో, హెచ్‌ఎం అభినందించారు.

చెన్నకేశవస్వామికి పల్లకోత్సవం



పల్లకీలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా హరి నామ స్మరణతో మార్మోగింది. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ చేపట్టారు. భక్తులకు ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రి పి.కోటకొండ భజన బృందం భజన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఘనంగా కూర్మ నారాయణ స్వామి ఉత్సవాలు



ప్రభను లాగుతున్న భక్తులు

ఆస్పరి: శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని హలిగేరి సమీపంలోని కొండల్లో వెలసిన స్వయంభూ కూర్మనారాయణ (నల్లగుట్టయ్య) స్వామి, హనుమన్న స్వామి వార్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో స్వాములకు గంగ,ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, ప్రభోత్సవం తదితర కార్యక్రమాలు జరిపించారు. ఆస్పరి, యాటకల్, ఐనకల్, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, చొక్కనహళ్లి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అలాగే హలిగేరిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

సేవతోనే ఉద్యోగికి సంతృప్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

దేవనకొండ: ప్రజలకు సేవచేసి ప్రశంసలు అందుకున్నప్పుడే ఉద్యోగికి ఆత్మసంతృప్తి కలుగుతుందని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, దేవనకొండ తహసీల్దార్ జయన్న అన్నారు. శనివారం సాయంత్రం దేవనకొండలోని లక్ష్మిరంగా ఫంక్షన్ హాల్‌లో జయన్న పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సురేష్‌బాబు, డీటీ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సంఘం నాయకులు, వీఆర్వోలు, డీలర్లు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు రక్తపు చారలు ..

నేడు పసిడి పంటలు



గ్రామస్తులతో సమావేశమైన రవికృష్ణ (ఫైల్)

నాడు కత్తులు పట్టిన చేతులు.. నేడు నాగళ్లు పట్టాయి. అప్పట్లో రక్తం చిందిన నేల.. ప్రస్తుతం పంటల పచ్చదనంతో అలరారుతోంది. ఒకప్పుడు భయానక పరిస్థితులు.. ఇప్పుడు ఆహ్లాదకర వాతావరణం.. నిత్యం పగతో బతికిన వారిని రైతన్నలుగా మార్చి, వారి పిల్లలను ప్రయోజకులయ్యేలా చేశారు ఓ ఐపీఎస్ అధికారి. నేడు పసిడి పంటలు పండిస్తూ ఆదర్శంగా మారిన గ్రామమే కప్పట్రాళ్ల. నేటికీ గ్రామానికి అండగా నిలుస్తున్న ఆ అధికారి ఆకె రవికృష్ణ.

- ఫ్యాక్షన్ గ్రామంగా కప్పట్రాళ్ల
- గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐపీఎస్ ఆకె రవికృష్ణ
- గ్రామ రూపురేఖలు మార్చిన అధికారి
- ఎందరికో ఉద్యోగాలు, ఊర్లో అభివృద్ధి పనులు
- ప్రస్తుతం పసిడి పంటలకు నిలయంగా మారిన వైనం



కప్పట్రాళ్ల గ్రామంలో నిర్మించిన స్త్రీ శక్తి భవనం



నూతన జెడ్పీ పాఠశాల భవనం



సే ట్రీస్ ద్వారా 10 మెట్రిక్ టన్నుల సోలార్ కోల్డ్ స్టోరేజీ

దేవనకొండ: కర్నూలు జిల్లాలో ఆ ఊరి పేరు వింటేనే అందరికీ హడల్. ఫ్యాక్షన్‌కు కేరాఫ్‌గా ఉన్న కప్పట్రాళ్ల గ్రామం కాల క్రమేణా ఫ్యాక్షన్ ఊబి నుంచి బయటపడేలా చేశారు ఓ ఐపీఎస్ అధికారి. తాను జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించే సమయంలో ఆ గ్రామాన్ని ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ దత్తత తీసుకున్నారు. అక్కడి ప్రజల్లో మార్పు తీసుకొచ్చి, జీవన విధానాన్ని మెరుగుపరిచి ఉపాధి అవకాశాలు కల్పించారు. నాడు కత్తులు పట్టిన ఆ చేతులతో నాగళ్లు పట్టించి పసిడి పంటలు పండించేలా చేశారు. మండల కేంద్రమైన దేవనకొండకు 25 కి.మీ. దూరంలో కప్పట్రాళ్ల గ్రామం ఉంది. గతంలో ఆ ఊరికి మౌలిక సదుపాయాలు, రోడ్డు సౌకర్యం కూడా లేదు. అలాంటి గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దారు రవికృష్ణ. 2014లో కర్నూలు జిల్లా ఎస్పీ ఆకె రవికృష్ణ గ్రామ పరిస్థితిని తెలుసుకున్నారు. పరిస్థితులు మారిస్తే ఊరి రూపురేఖలు మారుతాయని గ్రహించారు. మొదటగా గ్రామంలో హైస్కూల్ నిర్మాణానికి నాంది పలికారు. తానా వారి సహకారంతో నేటి వరకు గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా నుంచి ఆయన బదిలీ అయినా నేటికీ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గ్రామ అభివృద్ధికి పాటుపడిన ఆకె రవికృష్ణను అందరూ కప్పట్రాళ్ల శ్రీమంతుడిగా పిలుస్తున్నారు. కాగా ప్రస్తుతం సే ట్రీస్ అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి తన ప్రతినిధుల ద్వారా గ్రామానికి అవసరమైన పనులు చేయిస్తున్నారు రవికృష్ణ. ఆ సంస్థ ఈ ఏడాది రైతులకు వేలాది పండ్ల మొక్కలను ఉచితంగా అందజేసింది. అలాగే వ్యవసాయ పనిముట్లు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.

వ్యవసాయ బాటలో..

గ్రామం మొత్తం జనాభా 4,950 మంది ఉండగా.. గ్రామ రెవెన్యూ పరిధిలో 9,566 ఎకరాల భూములున్నాయి. ఇందులో సుమారు 300 ఎకరాల్లో పండ్ల తోటలు సాగయ్యాయి. వాటిలో దానిమ్మ, జామ, చీని అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం, కొత్తగా ఎర్రచందనం కూడా సాగవుతోంది. హంద్రీ -నీవా కాలువ ప్రవహిస్తుండటంతో ఆ నీటి ఆధారంగా దాదాపు 500 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. పండ్ల తోటల తరువాత ఇక్కడ సాధారణంగా మిర్చి ఎక్కువగా సాగవుతుంది.ఆ తరువాత పత్తి, వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. కూరగాయలను కోడుమూరు, కర్నూలు మార్కెట్లకు తరలించి విక్రయిస్తారు. ముఖ్యంగా కూరగాయల పంటల ద్వారా లాభాలు గడిస్తున్నారు. మహిళలు పొదుపు గ్రూపులుగా ఏర్పడి రుణాలతో స్వయం ఉపాధి పొందుతున్నారు. మహిళలు డిటర్జెంట్, అగరబత్తీలు, చిరుతిళ్ల సరుకులు తయారు చేసి విక్రయిస్తున్నారు. పలువురు మహిళలు కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు పాడి ఆధారంగా జీవనం సాగిస్తున్నారు.

ఉద్యోగాల బాటలో యువత..

రవికృష్ణ సూచన మేరకు పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. వారు ఉద్యోగాలు పొందేలా వారికి ఇష్టమైన రంగాల్లో శిక్షణ కూడా ఇప్పించారు. దీంతో గ్రామంలో వందమందికి పైగా ఉద్యోగాలు చేస్తున్నారు. పలువురు రవికృష్ణను ఆదర్శంగా తీసుకుని పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించారు. మరికొందరు ఉపాధ్యాయులుగా,బ్యాంక్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక స్వచ్ఛంద కార్యక్రమాల్లో గ్రామస్తులు, యువత స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- 2014లో కప్పట్రాళ్ల గ్రామాన్ని ఎస్పీ ఆకె రవికృష్ణ దత్తత తీసుకున్నారు.
- 2015లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్మించారు.
- 2015లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయించారు.
- 2019లో తానా ఆధ్వర్యంలో స్త్రీ శక్తి భవనాన్ని నిర్మించారు.
- 2019లో కళ్యాణ మండపాన్ని పూర్తి చేయించారు.
- 100 మహిళా సంఘాలను ఏర్పాటు చేసేలా చర్యలు
- రైతు సంఘం ఏర్పాటు
- సీసీ రోడ్ల నిర్మాణం
- సే ట్రీస్ ద్వారా 300 ఎకరాలకు ఉచిత పండ్ల మొక్కల పంపిణీ
- సే ట్రీస్ ద్వారా 2024లో 10 మెట్రిక్ టన్నుల సోలార్ కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు.
- సే ట్రీస్ కింద బయో గ్యాస్ నిర్మాణం
- సే ట్రీస్ ఆధ్వర్యంలో రైతులకు హార్టికల్చర్ పంటల సాగుపై శిక్షణ
- సే ట్రీస్ ద్వారా రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ
- ఏటా నిర్వహించే రక్తదాన శిబిరంలో గ్రామంలోని యువత ఉత్సాహంగా పాల్గొంటారు.

ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ సేవలు మరువలేనివి



2014లో ఎస్పీగా ఉన్న ఆకె రవికృష్ణ మా గ్రామాన్ని దత్తత తీసుకుని ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. ఆయన చేస్తున్న అభివృద్ధికి నా వంతుగా సాయం అందించాను. గ్రామంలో కళ్యాణ మండపం ఏర్పాటుకు నా స్థలాన్ని విరాళంగా ఇచ్చాను. ప్రస్తుతం కళ్యాణ మండపం నిర్మించారు. అందులో వివాహాలు జరుపుతున్నారు. గ్రామంలో హైస్కూల్, మహిళా సంఘాల ఏర్పాటు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కూడా కల్పించారు. గ్రామంలో ఫ్యాక్షన్ అనే పదం వినపడకుండా చేశారు. ఆయన సేవలు మరువలేనివి.

– గొర్ల సుంకన్న, కప్పట్రాళ్ల గ్రామ రైతు

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే..



కప్పట్రాళ్ల గ్రామాన్ని ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ దత్తత తీసుకుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా గ్రామస్తులను పండ్ల తోటల సాగువైపు మళ్లించారు. ఈ అభివృద్ధిలో నేను కూడా పాలు పంచుకోవడం సంతోషంగా ఉంది.

– బండిమీది నారాయణ, సే ట్రీస్ ప్రోగ్రాం మేనేజర్, కప్పట్రాళ్ల గ్రామం

సేవలే గుర్తుండిపోతాయి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని, అయితే ప్రజలకు చేసిన సేవలే గుర్తుండిపోతాయని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున అన్నారు. శనివారం ఎంపీడీఓ నరసింహమూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయా శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు రాజకీయాలకతీతంగా ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. పలువురు మాట్లాడుతూ మండలాన్ని ఉత్తమంగా తీర్చిదిద్ది కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు రివార్డు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంపీడీఓ దంపతులను సన్మానించారు. పరిపాలనాధికారి స్వర్ణలత, ఏఓ రవి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు అంజనేయులు, రామకృష్ణారెడ్డి, ఈఓఆర్డీలు మద్దిలేటిస్వామి, శ్రీహరి, ఏఈలు మయాంక్, ఉమాకాంత్ ఏఓలు శివకుమార్, సుధాకర్, పరమేష్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

పత్తికొండ(అశ్లగద్ద): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఈఓ నరసింహులు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగమ్మ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఈఓతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ము దీపిక సత్కరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, గృహ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కృష్ణగిరి ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు తమ పొలాల్లోని విద్యుత్ బోర్డులో ఉన్న స్విచ్చులను తడి చేతులతో ఆన్ చేయరాదన్నారు. ఇంట్లో అతుకుల విద్యుత్ తీగలు ఉంటే వాటిని ఎలక్ట్రీషియన్‌తోనే మార్చుకోవాలన్నారు. రహదారుల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, సపోర్టు వైరును ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని సూచించారు. వ్యవసాయ పంపుసెట్లకు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ పెట్టుకోవాలని, వర్షానికి ఎక్కడైనా తీగలు తెగిపడినా విద్యుత్ అధికారులకు తెలియజేయాలని కోరారు.

హాలహర్వి: వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ జంబన్న సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంట్లోని స్విచ్‌బోర్డులను తడి చేతులతో తాకరాదన్నారు. కరెంట్ స్తంభాలను తాకరాదన్నారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగిపడితే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

పవనపుత్రుడికి శనివార పూజలు



ఆంజనేయస్వామిని అరటి పండ్లతో అలంకరించిన దృశ్యం

హొళగుంద: మండలంలోని హొళగుంద, లింగంపల్లి, గజ్జహళ్లి తదితర గ్రామాల్లో వెలిసిన ఆంజనేయస్వామికి శ్రావణ మాసం ఆఖరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గజ్జహళ్లిలో కట్టె ఆంజనేయ స్వామికి భక్తులు అరటి పండ్లతో అలంకరించి పూజలు చేశారు. అగ్రహార ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి భక్తులు భజనలు చేసుకుంటూ కాలి నడకన తరలివెళ్లారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

కృష్ణగిరి: పెనుమాడ గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి గ్రామోత్సవాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయమే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. సాయంత్రం ఆశ్వాన్ని ఊరేగింపుగా గ్రామస్తులు కొండపై వెళ్లి అక్కడ ధనలయ్యకు పూజలు నిర్వహించి భక్తులకు వరదపాశం కాచి పెట్టారు.

లక్ష్యాలను చేరుకోవాలి

హొళగుంద: ప్రతి శాఖకు చెందిన అధికారులు వికసిత్ ఆంధ్ర కార్యక్రమం లక్ష్యాన్ని చేరుకోవాలని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకధికారి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఈ నెల1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే జాతీయ పోషణ వారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా శాఖాధికారులకు ఎంపీడీఓ సుహాసిని, ఆస్పిరేషన్ బ్లాక్ కో ఆర్డినేటర్ రవిశంకర్ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. హొళగుంద పీహెచ్‌సీ వైద్యధికారి న్యూటన్, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీబారాణి పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

పత్తికొండ(తుగ్గలి) : కురుస్తున్న వర్షాల పట్ల డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామలక్ష్మి కోరారు. వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సెల్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. అత్యవసర సాయం కోసం ఆర్డీవో కార్యాలయం 9010652595, ఆలూరు తహసీల్దార్ కార్యాలయం 9441544192, ఆస్పరి 9704390458, చిప్పగిరి 8121140364, పత్తికొండ 9493818095, తుగ్గలి 9441933951, కృష్ణగిరి 9182661898, మద్దికెర, 9440427576, దేవనకొండ 9177486648, హలహర్వి 9182918508 ఫోన్ చేయాలని సూచించారు.

నివాళి

హొళగుంద: సమ్మతగేరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, లీగల్ అడ్వైజర్ లక్ష్మీకాంత్ తల్లి నారాయణమ్మ (71) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి గ్రామానికి చేరుకుని నారాయణమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మురుగు తొలగించాలి

ఆస్పరి: మండలంలోని తురువగల్లు ప్రాథమిక పాఠశాల ముందున్న మురుగు తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవి శనివారం విద్యార్థులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ముందు అపరిశుభ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మురుగు వాసనకు విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

కూలిన మట్టి మిద్దె



ముద్దటమాగిలో కూలిన మట్టి మిద్దె

హొళగుంద: స్థానిక పింజరిగేరిలోని గవీర్ల చావిడి వద్ద బారికి వీరేశ్‌కు చెందిన మట్టి మిద్దె శనివారం కూలిపోయింది. కురుస్తున్న వర్షాలకు మట్టి బాగా తడిచిపోయి మిద్దె కూలిందని బాధితుడు తెలిపాడు. కూలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నాడు. మిద్దె కూలడంతో సామగ్రి, నిత్యావసర వస్తువులు మట్టి పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు

నీట మునిగిన పంటలు

- ఆలూరు నియోజకవర్గంలో భారీ వర్షం
- నీటమునిగిన పత్తి, మిరప తదితర పంటలు



బిలేహాళ్ వద్ద పత్తి పంట మునిగిందని చూపుతున్న రైతు చిన్నకొండయ్య



నీట మునిగిన మిరప పంటను చూపుతున్న రైతు

ఆలూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల వంకలు, వాగులు, ఉప్పొంగి పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో నీట మునిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అరికెర, ముద్దనగేరి, హాలహర్వి మండలం మిదేహాళ్, కామినహాళ్, చింతకుంట, సిద్దాపురం, అమృతాపురం, ఆస్పరి మండలం ముతుకూరు, వలగొండ,బిల్లేకల్లు, యాటకల్లు , దేవనకొండ మండలం అలారుదిన్నె, తెర్నెకల్, పొట్లపాడు, హొళగుంద మండలం ముర్లమడికి, చిప్పగిరి మండలం నంచర్ల, దొల్లాపురం, నేమకల్లు, తిమ్మాపురం, బంటనహాళ్ తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలు వల్ల పత్తి, మిరప, కంది, కొర్ర తదితర పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు.

రోజంతా ముసురు

ఆలూరు రూరల్: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రోజంతా ముసురు కోవడంతో కర్నూలు-బళ్లారి, ఎల్లార్తి-హొళగుందకు వెళ్లే రహదారులు చిత్తడిగా మారాయి. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ఇబ్బంది పడ్డారు. వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మట్టి మిద్దెల ఇళ్లలో ఉన్న వారు ఖాళీ చేయాలని వీఆర్వోలు ప్రజలకు తెలియజేస్తున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



నాకున్న మూడెకరాల్లో పత్తి పంటను సాగుచేశా. పంటసాగుకు దాదాపు రూ. 45 వేలు ఖర్చు చేశాను. కురుస్తున్న వర్షాలకు పంటలో వరద నీరు చేరడంతో పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. తెచ్చిన అప్పు తీర్చడం కష్టమే. – లోకనాథ్ రైతు, నిట్రవట్టి

పంట నష్టం అంచనా వేస్తున్నాం

ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసి పంటలు అధిక వర్షం వల్ల దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటికే పలుగ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది పర్యటిస్తున్నారు. పంట కోత ప్రయోగం ద్వారా నష్టం, దిగుబడిని లెక్కిస్తున్నాం.

– సునీత, ఏడీఏ, ఆలూరు

నేటి నుంచి స్వచ్ఛత పఖ్వాడా

తుగ్గలి: సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు పాఠశాలల్లో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం నిర్వహించాలని పత్తికొండ ఎంఈఓ-2 రమేష్ శనివారం తెలిపారు. 1న ప్రతిజ్ఞ, 2న తల్లిదండ్రుల సమావేశం, 3న పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 4న విద్యార్థులు, ఉపాధ్యాయుల గ్రామాల సందర్శన, 6న నీటి సంరక్షణపై అవగాహన, 7న పరిశుభ్రతపై పోటీలు, 9న చేతుల శుభ్రత, 11న వ్యక్తిగత శుభ్రత, 12న స్వచ్ఛత పఖ్వాడా ఎగ్జిబిషన్, 13,14తేదీల్లో భవిష్యత్ ప్రణాళిక, 15న బహుమతుల ప్రదానోత్సవాలు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

ముగిసిన ఉత్సవాలు

కృష్ణగిరి: మండలంలోని కోయిలకొండ గ్రామ శ్రీ కృష్ణ మందిరంలో ఆరు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు శనివారం ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆరు అడుగుల శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు నిర్వహించి, భజనలు, భగవద్గీత శ్లోక పారాయణం చేపట్టారు. సమితి అధ్యక్షుడు రామాంజనేయులు , సభ్యులు మల్లికార్జున, చెన్నకేశవులు, సుధాకర్, మాధవకృష్ణ, మదనశేఖర్, కృష్ణ, గంగధార్, మధు, రంగస్వామి ఉన్నారు.

సాగు,తాగు నీరు ఇవ్వాలి

పత్తికొండ(తుగ్గలి) : పందికోన రిజర్వాయర్ ఎడమ కాల్వ పనులు పూర్తి చేసి పత్తికొండ, ఆస్పరి మండలాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్, హనుమంతు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఈశ్వరరెడ్డి భవన్‌లో తుగ్గలి, ఆస్పరి, దేవనకొండ మండలాల పార్టీ శ్రేణులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జిల్లా నాయకుడు ఆనంద్‌బాబు శిక్షణ ఇచ్చారు. మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు దస్తగిరి, వెంకటేశ్వరరెడ్డి, సురేంద్ర, గోపాల్, సిద్ధయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయిని మృతి

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న జ్యోతి (49) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమె ఇక్కడ 5 సంవత్సరాల నుంచి పనిచేస్తుంది. అనారోగ్యంగా ఉండడంతో ఈమె రెండు నెలలు నుంచి సెలవుల్లో ఉన్నట్లు హెచ్ఎం విజయకుమారి తెలిపారు. ఈమె మృతి పట్ల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

పత్తికొండ(తుగ్గలి) : రాబోయే రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కోరారు. శనివారం ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. కల్వర్టు, వంకలు, వాగుల వద్ద ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గాలులకు చెట్ల కొమ్మలు విరిగి రోడ్ల మీద పడితే వెంటనే తొలగించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలని, విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసు కోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

పింఛన్ల పంపిణీ

పత్తికొండ(తుగ్గలి) : సెప్టెంబర్ నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. పత్తికొండ మండలం రామచంద్రాపురం గ్రామంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొని పింఛన్‌దారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా వారి ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. అలాగే తుగ్గలి మండలంలో సచివాలయ ఉద్యోగులు పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు.